
# గురుదక్షిణ

**ప్రకాష్**




**బేతాళుడిని కట్టిన తాళ్ళను కత్తితో పరపరా కోసిన విక్రమార్కుడు కెవ్వున అరవ బోయి సంబాళించుకున్నాడు. తాళుడిని భుజాన వేసుకున్నాడు. "ఓ రాజా! నీకు విసుగు కలగకుండా వుండేందుకు ఒకకథ చెబుతాను..."**

* * *

నమశ్శివాయ మిడిల్‌స్కూల్‌లో తెలుగు మాస్టారుగా పనిచేసేవాడు. అతని భార్యకి వున్న విపరీతమైన సినిమా పిచ్చి అతనికి లేశమైనా అంటలేదు. ఎంత సేపు బడిబడి అంటూ వుండే వాడు. అతను ఎంత మెతక వాడు అంటే మిగతా టీచర్లు పై పనులు చూసుకుంటుంటే వారి బాధ్యతలు కూడా తానే స్వీకరించే వాడు. దాంతో అతను హిస్టరీ, లెక్కలు, సైన్స్, డ్రాయింగ్ కమ్ తెలుగు టీచరు అయ్యాడు.

అతనికి మతిమరుపు ఎక్కువ. ఒక వార పత్రిక ద్వారా తన లక్కీ నంబరు తొమ్మిది అని తెలుసుకుని, మరచిపోయి నాలుగుగా గుర్తుంచుకుని ఆ నాలుగుతో ముగిసే నంబరు వున్న లాటరీ టికెట్ కొన్నాడు. దానికే లక్ష రూపాయల బహుమతి వచ్చింది.

తనని హీరోయిన్‌గా చేసి సినిమా తియ్యమని పోరింది అతని భార్య. నమశ్శివాయ వల్ల కాదన్నాడు. ఆ మొండి తనం అతని భార్యకు విసుగు కలగ చేసింది. అందుకనే తెగించి చేత చిక్కిన డెబ్బై వేలు తీసుకుని మద్రాసు వెళ్ళిపోయింది. మొదటిసారిగా నమశ్శివాయకి కోపం వచ్చింది. ఆ తిక్కలో అతను ముందూ వెనకా ఆలోచించకుండా మిగిలిన ముప్పై వేలు ఖర్చు చేసి భార్య కోసం వెతికాడు. తన లాగే అతను కూడా వున్న డబ్బంతా ఖర్చుపెట్టాడని తెలుసుకున్న అతని భార్య మద్రాసులో వుంటే ఎక్స్‌ట్రా వేషాలు వేసుకుని బతకవచ్చు నీతో రాను పొమ్మంది.

అన్నాళ్ళు కాపురం చేసిన భార్యను, ఆయాచితంగా వచ్చిన డబ్బును సునాయాసంగా పోగొట్టుకుని కొండంత అపహాస్యాన్ని కొని తెచ్చుకుని స్వంత వూరికి తిరిగి వచ్చాడు నమశ్శివాయ. ప్రముఖ రచయిత భూపతి ఒక వార పత్రికలో నిర్వహిస్తున్న 'నీ సమస్యకి నా పరిష్కారం' అన్న శీర్షికకి తన గాథనంతా కళ్ళకి కట్టినట్టు వర్ణించి పంపాడు. అతని కష్టాలకంటే వాటిని అతను విశదీకరించిన శైలీ, రీతి భూపతిని ఆకట్టుకొన్నాయి. అందుకనే భూపతి అతని రచయితగా మారమని, ఆ వ్యాపకంలో వ్యథలన్నీ మరవవచ్చని సలహా యిచ్చాడు. అదే నమశ్శివాయలోని మెట మార్ఫసిస్‌కి కారణం అయ్యింది.

అంత వరకూ ఏకధాటిన సస్పెన్స్ నవలలు చదివి విసుగెత్తిపోయిన తెలుగు పాఠకులకు నమశ్శివాయ తన కథని కొంత మార్చి వ్రాసిన నవల ఎంతగానో నచ్చింది. దాంతో అతని మొదటి నవలే సూపర్ హిట్ అయ్యింది. ఇకపోతే రెండవ నవల... ఏడవ తరగతి వాళ్ళకి అప్పుడప్పుడూ సైన్స్ బోధించిన పరిజ్ఞానాన్ని ఆధా రంగా తీసుకుని అతను వ్రాసిన రెండవ నవల... సైన్స్ ఫిక్షన్ నవల తెలుగులో ఓ ట్రెండ్ సెటర్ అయి కూర్చుంది. దశాబ్దం పైగా తెలుగు సాహిత్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన భూపతి దాదాపు అదే సమయంలో సినిమా కథలు వ్రాయటంలో మునిగిపోయి తెలుగు పాఠకులకు అందకుండా ఎదిగిపోయాడు. దానిని లోటుగా భావించే అవకాశం ఎవరికీ ఇవ్వలేదు నమశ్శివాయ. చారిత్రాత్మక, రాజ కీయ, పరిశోధక నవలల నుండి సైన్స్‌ఫిక్షన్, నాన్సెన్సికల్, రొమాంటిక్ నవలల వరకూ ప్రతి దాంట్లోను ఒక కొత్త ఒరవడి సృష్టించాడు. అంత వరకూ భూపతిని అనుకరించిన వారికీ, తమ కంటూ ఒక పంథా కాపాడుకున్న వారికీ కూడా నమశ్శివాయ తరహా రచనలు చేయాల్సివచ్చింది. అతని ప్రతిభ ఎల్లలు ఎరుగనిదై అనువాదకుల సాయంతో పాక్ ఆక్రమిత కాశ్మీరం నుండి తమిళులుండే శ్రీలంక ప్రాంతాల వరకూ పాకింది. పైగా అతను సవ్యసాచిలా ఎడాపెడా నవలలు వ్రాస్తుంటే తెలుగు సాహిత్యం మైనస్ నమ

శ్శివాయ వెరసి శూన్యం అన్న పలుకుబడి వచ్చింది. ఇది మిగిలిన రచయితలకి తలవంపే గాక తలనెప్పిగా, కడుపు మంటగా తయారయింది.

దాంతో వారంతా కలిసి నమశ్శివాయవ్యతిరేక రచయితల సంఘం స్థాపించారు. నవ్యరసం వారంతా కలిసి రచనా నిరంకుశత్వానికి ఎలా అడ్డు కట్ట వేయాలా అని ఆలోచించి నిర్ణయానికి వచ్చారు. వారంతా భూపతిని కలిశారు (భూపతి అప్పటికి మద్రాసు నుండి బొంబాయికి ఎదిగాడు.) తమ ఆక్రోశం వెల్లడించి నమశ్శివాయ చేత రచనా నియంత్రణ చేయించాల్సిన బాధ్యత భూపతిదే అన్నారు. ఎందుకో భూపతి సరే అన్నాడు. నవ్యరసం సభ్యులు సంబరపడ్డారు.

భూపతి తనని ఎందుకు కలవబోతున్నాడో చూచాయగా నమశ్శివాయకి తెలిసింది. ఏర్ పోర్ట్‌లో భూపతిని కలిసి సరాసరి అతనిని హోటల్‌కి తీసుకు వెళ్ళాడు నమశ్శివాయ. అతిథి సత్కారాలకు లోటు చేయలేదు. రమ్ము మెదటి రౌండ్ అయ్యాక అసంతృప్తిగా మొహం పెట్టాడు భూపతి.

# సోమరి

ఆకలిని సైతం
అవలీలగా జయించగలడని
ఆశ్చర్యపోకు;
ఆ విజయానికి సాధనాలు —
అతడి పగటి కలలు!

— కలువకొలను సదానంద

"మీకు నేను ఏకలవ్యుడి లాంటి వాడిని. ఏం కావాలో నిర్మొహమాటంగా అడగండి" అన్నాడు నమశ్శివాయ వినయంగా.

భూపతి కుడిచేయి ముందుకుసాచి పిడికిలి బిగించి బొటన వేలు ఎత్తి చూపించాడు.

ఏకలవ్యుడు, ద్రోణుడు, బొటనవేలు పాఠం గుర్తుకు రావటంతో నిర్ఘాంతపోయాడు నమశ్శివాయ. 'రచయితలలో దుర్మార్గులుంటారుగాని యింత దుర్మార్గులుంటారా' అని అనుకుని "గురూగారూ యిది తగునా? అరచేత్తో రవిని, బొటన వేలుతో కవిని ఆపగలరా? కోసిన నాబొటన వేలుతో నా రచనా ప్రవాహానికి ఆనకట్ట వెయ్యాలనా మీ పన్నాగం? మిగిలిన రచయితలకి..."

అయోమయంగా నవ్వాడు భూపతి. "చూడు నమశ్శివాయ! నీ బొటనవేలు నాకెందుకోయ్? 'థమ్స్ అప్!' రమ్ములోకి కోకోకోలానో థమ్స్ అప్ గాని లేకపోతే మజాలేదు కదా! అందుకే థమ్స్ అప్ కావాలి అంటున్నాను" అని మళ్ళీ నవ్వాడు.

* * *

కథ చెప్పటం ఒకనిముషం ఆపాడు బేతాళుడు. "రాజా! ఇంతకీ భూపతి ఆ తర్వాత నవ్యరసానికి అన్యాయం చేశాడా లేకపోతే నమశ్శివాయకి ద్రోణం(హం) చేశాడా? నీకు సమాధానం తెలిసీ చెప్పకపోతే నీ కుడి బొటనవేలు వేయి ముక్కలౌతుంది" అన్నాడు.

అంత వరకూ బాధతో ముడుచుకు పోయిన విక్రమార్కుడి మొహం వికసించింది. తనకు సమాధానం తెలిసినా చెప్పి మౌనభంగం చేసుకోనక్కర్లేదు. ఇందాక బేతాళుడి తాళ్ళు కోస్తుంటే తన బొటన వేలు మొదలంటా కోసుకుపోవటం మంచిదే అయ్యిందనుకుంటూ తన గమ్యస్థానం వేపు నడిచాడు ఎలాగయితేనేం విజయం సాధించిన విక్రమార్కుడు! ●


ధన్వంతరయే నమః

గ్రామ్స్: ఆయుర్వేదిక్. ఆలమూరు.

ఫోన్: 14 ఆలమూరు.

చింతలూరు ఫార్మశీ

వైద్య విద్వాన్, ఆయుర్వేద భిషక్
ద్విభాష్యం కాశీవిశ్వనాథం అండ్ సన్స్ వారి
శాస్త్రీయ ఆయుర్వేద ఔషధములు
తయారుచేయుటలో అగ్రగామి సంస్థ!

— చింతలూరు —
ఆయుర్వేద ఫార్మశీ
చింతలూరు-533232

ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల స్టాకిస్టులు కలరు!
లేనిచోట్ల వివరములకై సంప్రదించండి!!

వోస్టు ద్వారా చికిత్స కలదు.

GAYATRI., SHAH

Design/Matter Approved.



ఎమెస్కో వారి యిటీవలి పునర్ముద్రణలు

| | | |
|---|---|---|
| రాజశేఖర చరిత్రము | • కందుకూరి వీరేశలింగం | 7-50 |
| కావ్యాలంకార సంగ్రహము | • శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి | 50-00 |
| గాలిబ్ గీతాలు | • డా. దాశరథి | 16-00 |
| చరిత్రకెక్కిన చరితార్థులు 1,2,3 భాగాలు | • డా. చల్లా రాధాకృష్ణ శర్మ | 17-00 |
| ఎమెస్కో పాకెట్ తెలుగు ఇంగ్లీషు డిక్షనరీ | • బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు | 6-00 |



మీకు కావలసిన పుస్తకం ఇటీవు ఎమ్.వో. చేయండి. పోస్టేజికి వి.పి పెట్టి పంపిస్తాము.

ప్రతులకు:

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ - 500 003